

## రచితా రామ్ బుగ్గలు గిల్లిన అభిమాని..

కన్నడ స్టార్ హీరోయిన్, 'డింపుల్ క్వీన్' రచితా రామ్‌కు తన పుట్టినరోజు వేడుకల్లో ఓ అభిమాని నుంచి ఊహించని అనుభవం ఎదురైంది. సెల్ఫీ తీసుకున్న ఆనందంలో ఒక యువకుడు ఆమె బుగ్గలు గిల్లగా, రచిత ఏమాత్రం ఆగ్రహం వ్యక్తం చేయకుండా చిరునవ్వుతో స్పందించి అభిమానుల మనసు గెలుచుకున్నారు.

8


— ప్రజా గళమే —

# స్పందన

SPANDHA NEWS

జాతీయ తెలుగు దినపత్రిక

Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106

ఆదివారం || 4-10-2026 || సంపుటి: 1 || సంచిక: 61 || పేజీలు: 8 || వెల : రూ.5/-

Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal







# శ్రీసిటీలో పెను ప్రమాదం!

- బాయిలర్ పేలి ఐదుగురు కార్మికుల మృత్యువాత
- షిఫ్ట్ మారుతున్న సమయంలో ఊహించని మృత్యుపాశం
- మృతుల కుటుంబాలకు 50 లక్షల పరిహారం ప్రకటన
- పరిశ్రమను సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ
- కేసు నమోదు.. దర్యాప్తు



శ్రీసిటీలోని టీఐఎల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో శనివారం ఉదయం జరిగిన విషాదకర బాయిలర్ పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు మృతి చెందారు. షిఫ్ట్ మార్పు సమయంలో ఈ పెను ప్రమాదం చోటుచేసుకుంది.

వివరాలు 3వ పేజీలో



### శ్రీసిటీ ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి!

**కార్మికుల మృతి పట్ల విచారం**

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

3

### బాధిత కుటుంబాలను ఆదుకోవాలి!



**శ్రీసిటీ ఘటనపై మాజీ సీఎం జగన్ విచారం**

ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి

# ఏపీ అభివృద్ధికి ఐఐటీయన్ల మేధస్సు

### అమరావతి వేదికగా వరల్డ్ పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటు



- డీప్ టెక్ స్టార్టప్‌ల కోసం రూ. 500 కోట్లతో వెంచర్ ఫండ్
- సీఎం చేతుల మీదుగా ఐదు 'క్యు-శివ' క్వాంటం కంప్యూటర్ల ఆవిష్కరణ
- ఏపీకి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ చేసేందుకు 23 ఐఐటీల అంగీకారం
- పాన్ ఐఐటీ ఏపీ 2026 సదస్సులో ఉమ్మడి డిక్లరేషన్ విడుదల

**విజయవాడ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఐఐటియన్ల మేధస్సు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలతో పాటు దేశాభివృద్ధి కోసం వారంతా అనుసంధానమై నెట్‌వర్క్‌గా ఏర్పడాలని ఆయన సూచించారు. శనివారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగులు పడ్డాయని ఆయన వ్యాఖ్యానించారు. సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు 'క్యు–శివ' పేరుతో రూపొందించిన ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ రూపొందించిన ఈ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్ ల్యాబ్‌లుగా ఉపయోగపడనున్నాయి. అలాగే 4 కెల్విన్ ప్రాసెసర్ సృష్టిని కూడా సీఎం ఆవిష్కరించారు. క్యు–శివ కంప్యూటర్ల తయారీలో

మిగతా 2 లో



# 'వోట్ చోరీ' నుంచి.. 'క్రెడిట్ చోరీ' దాకా!

### ఎన్నికల సంఘంపై పోరు ఎవరిది?

- కాంగ్రెస్-సీజేపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా వార్
- శివాజీ పార్క్ నిరసన తర్వాత మరింత ముదిరిన మాటల యుద్ధం
- 'ట్విట్టర్‌కే పరిమితమైన లిబరల్ వ్యవస్థ' అంటూ అశుతోష్ రాంకా సెటైర్లు
- 'ఏళ్లుగా పోరాడుతున్నది మేమే' అంటూ కాంగ్రెస్ శ్రేణుల ఎదురుదాడి

..వివరాలు 4లో

ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై మొదలైన 'వోట్ చోరీ' రాజకీయ వివాదం ఇప్పుడు విపక్ష శిబిరంలోనే 'క్రెడిట్ చోరీ' రచ్చకు దారితీసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాకరోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమం నేపథ్యంలో.. ఈ అంశంపై అసలు పోరాటం చేస్తున్నదెవరన్న దానిపై సీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య సామాజిక మాధ్యమాల్లో మాటల యుద్ధం మొదలైంది. '

సీఎం స్మార్టర్..

# యువతే హార్డ్‌వేర్!

- విజయవాడ పాన్‌ఐఐటీ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు
- సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని ఆపరేటింగ్ సిస్టమ్‌తో పోల్చిన మంత్రి
- ప్రస్తుతం ముఖ్యమంత్రి పాలన వెర్షన్ 4.0లో నడుస్తోందంటూ కితాబు

2





## విజయవాడ ఉత్సవ్‌కు రాష్ట్రపతి ముర్ము!

**ఉత్సవ్ ఏర్పాట్ల వివరాలు వెల్లడించిన కొమ్మారెడ్డి పట్టాభిరామ్**

3

## సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు!

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్తాం : మంత్రి నారాయణ
- ఎన్డీఏ కూటమి బీసీల రిజర్వేషన్లకే కట్టుబడి ఉందని స్పష్టీకరణ



2

## ఉద్యమాలన్నింటికీ ఒకే 'డిజిటల్ అడ్డా'!

- 'సత్యాగ్రహ' వేదికను ప్రారంభించిన రాహుల్‌గాంధీ
- పోరాటాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకొచ్చే ప్రయత్నం
- సమస్యను నమోదు చేస్తే.. అదే అంశంపై పోరాడుతున్న వారితో అనుసంధానం



.. వివరాలు 4లో



లోక్‌సభ, అసెంబ్లీలను వెంటనే

## రద్దు చేయాలి!

ఎన్నికలన్నీ అక్రమమన్న మల్లికార్జున ఖర్గే

వివరాలు 3లో

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక



# 264 విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు కొత్త భవనాలు సిద్ధం!

**6న మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**రూ. 103.16 కోట్ల వ్యయంతో సిద్ధమైన నూతన భవనాలు**

**24 జిల్లాల్లోని 87 నియోజకవర్గాల్లో అందుబాటులోకి నిర్మాణాలు**



**అమరావతి, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సేవలందిస్తున్న 264 విలేజ్ హెల్త్ క్లినిక్స్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు)కు రూ. 103.16 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఈ భవనాలను అక్టోబర్ 6వ తేదీన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ నూతన భవనాలు రాష్ట్రంలోని 24 జిల్లాల్లో గల 87 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. కృష్ణా జిల్లా గుడివాడ డివిజన్ నందివాడ మండలం రుద్రపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలోని జనార్ధనపురం గ్రామం వేదికగా రాష్ట్రస్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. అక్కడ నుంచి మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్ విధానంలో ఇతర జిల్లాల్లోని నూతన భవనాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. గ్రామీణ, మారుమూల గిరిజన ప్రాంతాల్లోని హెల్త్ క్లినిక్‌లకు పక్కా భవనాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్యం నిరంతరం అందుబాటులో ఉంటుంది. వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి సౌకర్యవంతమైన పని వాతావరణం ఏర్పడటంతో పాటు రోగులకు అవసరమైన ప్రాథమిక పరీక్షలు, నిత్యావసర ఔషధాల పంపిణీ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగడానికి ఈ భవనాలు ఎంతగానో దోహదపడనున్నాయి.

**రూ. 1,128 కోట్లతో 4,472 భవనాలు..**

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలతో పాటు, కొత్తగా మంజూరు చేసిన నిర్మాణాలు కలిపి మొత్తం 4,472 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు వివిధ కేంద్ర, రాష్ట్ర పథకాల కింద ప్రభుత్వం రూ. 1,128.02 కోట్ల భారీ నిధులను కేటాయించింది. పనుల్లో అలసత్వాన్ని వీడి నాణ్యతా ప్రమాణాలతో వీటిని పూర్తి చేయిస్తోంది. ఈ నిర్మాణ పనుల క్రమంలో భాగంగా డిసెంబరు 2026 నాటికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా మరో 2,750 భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టమైన లక్ష్యంగా పెట్టుకుంది. దశలవారీగా అన్ని క్లినిక్‌లకు పూర్తిస్థాయి శాశ్వత భవనాలు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని గ్రామీణ వైద్య ముఖచిత్రం సమూలంగా మారుతుందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు.

# బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

**వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఫైర్**

**అమరావతి, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

# ముమ్మందు ఆర్థిక సవాళ్లు తప్పవు

**అంతా బాగుందనుకుంటే ప్రమాదమే**

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి**

**ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి**

**ప్రపంచ దేశాల మధ్య విభేదాలు తప్పవు**

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదు-రవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు.

# ఏపీ అభివృద్ధికి ఐఐటీయన్ల మేధస్సు!

(మొదటి పేజీ తరువాయి..)

కీలకమైన కాంపోనెంట్లు మచిలీపట్నంలోనే లభ్యమవుతున్నాయని క్యూబిట్ సంస్థ సీఈఓ వివరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ ఫోర్స్, చండీగఢ్ యూనివర్సిటీ ప్రతినిధులను సీఎం అభినందించారు. సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడుకున్నట్లే ఇకపై అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం మాట్లాడుతుందన్నారు. 2027 ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

**పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్ డిక్లరేషన్..**

ఈ సదస్సులో మేథోమథనం అనంతరం ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ ప్రతినిధులు ఉమ్మడిగా డిక్లరేషన్ విడుదల చేశారు. అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నారు. సుమారు 5 లక్షల మంది ఐఐటీయన్ల మేధస్సును ఏపీ అభివృద్ధికి వినియోగించుకునేలా ఈ కౌన్సిల్ పని చేయనుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులకు ఊతమిచ్చేలా రూ. 500 కోట్లతో పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏపీకి టెక్నాలజీని ట్రాన్స్‌ఫర్ చేసేందుకు 23 ఐఐటీలు అంగీకరించాయి. అలాగే 100 మందితో గ్లోబల్ ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్ ఏర్పాటు చేసి ఏపీ స్టార్టప్‌లు, ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేయనున్నారు. 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు.

**వివిధ రంగాలపై ప్యానెల్ డిస్కషన్లు..**

రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో ఐఐటీ ఖరగ్‌పూర్, తిరుపతి, జమ్మూ, హైదరాబాద్, ధన్‌బాద్, వారణాసి, భువనేశ్వర్ తదితర సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు. ఐఐటీల సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులతో సమావేశమైన సీఎం.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, స్టార్టప్‌లు, పెట్టుబడుల గురించి చర్చించారు. ప్రతి ఏడాదీ పాన్ ఐఐటీ సమ్మిట్ నిర్వహించాలని ప్రతిపాదించారు. ఇంధనం, స్వచ్ఛాంధ్ర, డిఫెన్స్, హెల్త్‌కేర్, అగ్రిటెక్ తదితర రంగాల్లో డీప్‌టెక్ వినియోగంపై ఈ సదస్సులో విస్తృతంగా



చర్చలు జరిగాయి. సదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్లను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు.

# పేదల ఇళ్ల నిర్మాణంలో మరో ముందడుగు!

- **రాష్ట్రానికి పీఎంఏవై-జీ 2.0 కింద 3 లక్షల ఇళ్లు కేటాయించిన కేంద్రం**
- **నేడు బుర్రిపాలెంలో ఇళ్ల నిర్మాణ పనుల ప్రక్రియ ప్రారంభం**
- **పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**
- **గృహ నిర్మాణంలో అద్భుతాలు సృష్టించనున్న 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ**

**అమరావతి, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** పేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తోంది. మరింత మందికి లబ్ధి చేకూరేలా కొత్తగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఆయన భూమిపూజ చేయనున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షల ఇళ్లకు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు రెండు విడతలుగా సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించింది. ఇవే కాకుండా వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేలా పనులు వేగవంతం చేసింది. ఒకపక్క రాష్ట్రంలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతూనే, మరోపక్క ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) 2.0 పథకం కింద వీలైనన్ని ఇళ్లను కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. దీంట్లో భాగంగా ఇటీవలే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో మరింత జాప్యం చేయకుండా ఆ 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనుల ప్రక్రియను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లనుంది. గృహనిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రూర్కీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా '3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ'తో ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను చేపట్టనున్నాయి. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్న ఈ పైలట్ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ. 14 కోట్ల అంచనాతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ అనే అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగవంతమైన నిర్మాణం సాధ్యమవుతుంది. శ్రమ తగ్గడంతో పాటు నిర్మాణ వ్యర్థాలు అస్సలు ఉండవు. పైగా ఈ ఇళ్లు అత్యంత నాణ్యత, దృఢత్వంతో ఉంటాయని అధికారులు వెల్లడించారు.

# సీఎం సాఫ్ట్‌వేర్.. యువతే హార్డ్‌వేర్!

- **విజయవాడ పాన్‌ఐఐటీ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు**
- **సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని ఆపరేటింగ్ సిస్టమ్‌తో పోల్చిన మంత్రి**
- **ప్రస్తుతం ముఖ్యమంత్రి పాలన వెర్షన్ 4.0లో నడుస్తోందంటూ కితాబు**

**విజయవాడ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** పాన్‌ఐఐటీ కమ్యూనిటీ అంటే కంపెనీలను స్థాపించి, విస్తృత స్థాయిలో పరిశోధనలు చేసి, తమ నైపుణ్య రంగాల చుట్టూ పూర్తిస్థాయి పరిశ్రమలను నిర్మించిన ప్రతిభావంతుల సమూహమని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కొనియాడారు. విజయవాడలో జరుగుతున్న పాన్‌ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్ 2026లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని టెక్నాలజీ భాషలో ఆసక్తికరంగా విశ్లేషించారు. సీఎం చంద్రబాబు నాయకత్వ ప్రయాణాన్ని ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్) వెర్షన్లతో లోకేష్ పోల్చారు. "మీరు ఇప్పటికే వెర్షన్ 1.0, 2.0, 3.0 చూశారు. ఇప్పుడు ఆయన 4.0లో ఉన్నారు. ఆపరేటింగ్ సిస్టమ్ ఎప్పటికప్పుడు మెరుగుపడినట్లే, కొత్త పదవీకాలంలోకి



ప్రవేశిస్తున్న కొద్దీ ముఖ్యమంత్రి కూడా మరింత మెరుగవుతున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

**సాఫ్ట్‌వేర్.. యువ హార్డ్‌వేర్ కలయిక..**

ప్రస్తుత పదవీకాలాన్ని ప్రత్యేకంగా నిలబెట్టేది ముఖ్యమంత్రికి ఉన్న "యువ హార్డ్‌వేర్" అండ మాత్రమేనని నారా లోకేష్ స్పష్టం చేశారు. సభలో 50 శాతం మంది ఎమ్మెల్యేలు తొలిసారి ఎన్నికైనవారేనని, అలాగే 25 మంది మంత్రుల్లో 17 మంది తొలిసారి బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. ఈ యువ ఎమ్మెల్యేలు, మంత్రులు తమను తాము "హార్డ్‌వేర్"గా భావిస్తుండగా, సీఎం చంద్రబాబు "సాఫ్ట్‌వేర్"గా ఉన్నారన్నారు. ఈ అనుభవజ్ఞుడైన సాఫ్ట్‌వేర్, చురుకైన యువ హార్డ్‌వేర్ కలయికే ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా నిలబెడుతోందన్నారు.

**ఏపీ పర్యావరణ వ్యవస్థకు బలం..**

పాన్‌ఐఐటీ ఫెడరేషన్ దేశంలోని 23 ఐఐటీలను, దాదాపు 5 లక్షల మంది పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువస్తోందని, దీంతో మొత్తం వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతోందని మంత్రి అన్నారు. ఇంతటి బలమైన కమ్యూనిటీ ఆంధ్రప్రదేశ్‌కు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమ్మిట్‌ను ఏపీలో నిర్వహిస్తున్న పాన్‌ఐఐటీ ఫెడరేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కమ్యూనిటీ రాకతో రాష్ట్రంలోని ఆవిష్కరణలు, సాంకేతికత, ఔత్సాహికత, పరిశోధనలు, పరిశ్రమల పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే అవకాశం లభిస్తుందని నారా లోకేష్ ధీమా వ్యక్తం చేశారు.

# సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు!

- **బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్తున్నామన్న మంత్రి నారాయణ**
- **ఎన్డీఏ కూటమి బీసీల రిజర్వేషన్లకే కట్టుబడి ఉందని స్పష్టీకరణ**

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు తర్వాతే రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. అప్పటివరకు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు.

**బీసీల రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం..**

రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీలకు రానున్న రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పు త్వరగా వచ్చేలా ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. గత వైఎస్సార్సీపీ హయాంలో గొడ్డలి పార్టీ నేతలు బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం మాత్రం వారి హక్కులను కాపాడటానికే కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం



దారుణంగా దెబ్బతిందని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కేవలం 24 గంటల్లోనే లేఅవుట్‌లు, బిల్డింగ్ నిర్మాణ అనుమతులు జారీ చేసేలా పారదర్శక వ్యవస్థను తీసుకొచ్చినట్లు వివరించారు.

**2028 నాటికి అమరావతి పూర్తి..**

ప్రపంచంలోని అత్యుత్తమ టాప్-5 రాజధానుల్లో ఒకటిగా నిలిచేలా అమరావతి రాజధాని పనులను పునఃప్రారంభించామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2028 చివరి నాటికి రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని మంత్రి నారాయణ వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘాట్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం రూ. 2 వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టనున్నామని ఆయన స్పష్టం చేశారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక

ఆదివారం, 4 అక్టోబర్ 2026

# శ్రీసిటీలో పెను ప్రమాదం!

- బాయిలర్ పేలి ఐదుగురు కార్మికుల మృత్యువాత
- షిఫ్ట్ మారుతున్న సమయంలో ఊహించని మృత్యుపాశం
- మృతుల కుటుంబాలకు 50 లక్షల పరిహారం ప్రకటన
- పరిశ్రమను సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**శ్రీసిటీ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** శ్రీసిటీలోని టీఐఎల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో శనివారం ఉదయం జరిగిన విషాదకర బాయిలర్ పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు మృతి చెందారు. షిఫ్ట్ మార్పు సమయంలో ఈ పెను ప్రమాదం చోటుచేసుకుంది. గాంధీ జయంతి కారణంగా ముందు రోజు సెలవు కావడంతో పరిశ్రమలో ఆ సమయంలో అతి తక్కువ సిబ్బంది మాత్రమే విధుల్లో ఉండటంతో పెను ముప్పు తప్పింది. ఈ ప్రమాదంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌరబ్ రాయ్, సత్యవేడు మండలం చెరివికి చెందిన చిన్న మస్తాన్, తడకు చెందిన వాసు, మాదరపాక్కం వాసి రమేష్, నాయుడుకుప్పం వాసి మోహన్ మృతి చెందారు. వీరిలో నలుగురు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, వాసు తీవ్ర గాయాలతో చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర స్పందన బృందాలు, స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఘటనపై ప్రాథమికంగా కేసు నమోదు చేశామని, సమగ్ర దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాతో పాటు అంత్యక్రియలు, వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. ఈ ఘటనపై టీఐఎల్ హెల్త్‌కేర్ డైరెక్టర్ అజయ్ కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శ్రీసిటీలో 17 ఏళ్లుగా భద్రతా ప్రమాణాలతో కార్యకలాపాలు సాగిస్తున్నామని, ప్రభుత్వ దర్యాప్తుకు తమ సంస్థ పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సైతం ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీసిటీ 18 ఏళ్ల ప్రస్థానంలో ఇలా జరగడం ఇదే తొలిసారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఘటన తర్వాత పరిశ్రమల్లో భద్రతా ఆడిట్‌లు చేసినా ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని, బాధిత కుటుంబాలకు అవసరమైన ప్రతి సహాయం అందేలా చూస్తామని స్పష్టం చేశారు.

# శ్రీసిటీ ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి!

**కార్మికుల మృతి పట్ల విచారం**

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం**

**బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులకు సూచన**



**అమరావతి, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో వాటర్ బాయిలర్ పేలి నలుగురు కార్మికులు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీసిటీలో జరిగిన ఈ ప్రమాద తీవ్రతను ముఖ్యమంత్రి ఆరా తీశారు. బాయిలర్ పేలిన సమయంలో ఘటనా స్థలంలోనే ఇద్దరు చనిపోయారని, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని అధికారులు ఆయనకు వివరించారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తికి ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు. కార్మికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఈ కష్టకాలంలో అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

# బాధిత కుటుంబాలను ఆదుకోవాలి!

**శ్రీసిటీ ఘటనపై మాజీ సీఎం జగన్ విచారం**

**ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి**

**ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్**



**తాడేపల్లి, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో జరిగిన బాయిలర్ పేలుడు ఘటనలో నలుగురు మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు వైఎస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని, మనోస్థైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను వైఎస్ జగన్ కోరారు. వారు త్వరగా కోలుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి, తగిన సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# విజయవాడ ఉత్సవ్‌కు రాష్ట్రపతి ముర్ము!

- ఉత్సవ్ ఏర్పాట్ల వివరాలు వెల్లడించిన కొమ్మారెడ్డి పట్టాభిరామ్
- పలు రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించే పనిలో ఎంపీ కేశినేని




**విజయవాడ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** విజయవాడ నగరంలో త్వరలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక 'విజయవాడ ఉత్సవ్'కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వెల్లడించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

## విజయవంతంగా స్వచ్ఛథాన్..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ముందుకు సాగుతోందని పట్టాభిరామ్ తెలిపారు. ఇందులో భాగంగా విజయవాడలో శుక్రవారం నిర్వహించిన 'స్వచ్ఛ దివస్', 'స్వచ్ఛథాన్' (మారథాన్) కార్యక్రమాలకు విశేష స్పందన లభించిందన్నారు. దేశంలోని 22 రాష్ట్రాల నుంచి సుమారు 10 వేల మందికి పైగా రన్నర్లు ఈ మారథాన్‌లో పాల్గొన్నారని చెప్పారు. విజయవాడ నగర ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చి భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛథాన్ ఘన విజయం సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారని పట్టాభిరామ్ పేర్కొన్నారు.

## విజయవాడ ఉత్సవ్‌కు విస్తృత సన్నాహాలు..

ఇదే ఉత్సాహంతో త్వరలో జరగబోయే 'విజయవాడ ఉత్సవ్'ను కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నాయకత్వంలో ప్రజాప్రతినిధులందరూ సమిష్టిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాబోతున్నారని స్పష్టం చేశారు. అలాగే దేశంలోని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను స్వయంగా ఆహ్వానించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ వివిధ రాష్ట్రాల పర్యటనకు వెళ్లారని వివరించారు.

## లక్షలాది మందికి తగిన ఏర్పాట్లు..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ రెండూ ఒకే సమయంలో రానుండటంతో నగరానికి లక్షలాది మంది ప్రజలు, భక్తులు తరలివచ్చే అవకాశముందని పట్టాభిరామ్ చెప్పారు. వచ్చే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలను ఆస్వాదించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాలకు పలు ప్రముఖ సంస్థలు, పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకారం అందిస్తున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# భారత్‌కు డ్రగ్స్ స్మగ్లర్ నవ్‌ప్రీత్ సింగ్!

**టర్కీ నుంచి రప్పించిన భద్రతా సంస్థలు**

**ఏజెన్సీలను మెచ్చుకున్న అమిత్ షా**

**నవాబ్ విర్క్ పేరుతో నకిలీ పౌరసత్వం**

**అఫ్గాన్ నుంచి భారీగా డ్రగ్స్ రవాణా**

**2029 కల్లా డ్రగ్స్ ముఠాల నిర్మూలనే లక్ష్యం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కీలక నిందితుడైన నవ్‌ప్రీత్ సింగ్‌ను టర్కీ నుంచి భారత్‌కు రప్పించినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన భద్రతా సంస్థలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. నవ్‌ప్రీత్ సింగ్ అఫ్గానిస్తాన్ నుంచి భారత్‌కు హెరాయిన్, మెథాంఫెటమైన్ తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించాడు. పోలీసుల నుంచి తప్పించుకుని టర్కీ పారిపోయిన అతడు.. 'నవాబ్ విర్క్' అనే నకిలీ పేరుతో అక్కడి పౌరసత్వం కూడా పొందాడు. అయితే మన భద్రతా సంస్థలు అతని అసలు గుర్తింపును పసిగట్టి, అతడిని టర్కీ నుంచి బహిష్కరించేలా చర్యలు తీసుకున్నాయి. భారత్‌కు తీసుకువచ్చిన అనంతరం డ్రగ్స్ అక్రమ రవాణా సహా వివిధ కేసుల్లో అతడిని రిమాండ్ చేసి జైలుకు పంపినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. 2029 డిసెంబర్ నాటికి దేశంలో మాదకద్రవ్యాల ముఠాలను పూర్తిగా నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2019 నుంచి 2026 ఆగస్టు వరకు 36 దేశాల్లో తలదాచుకుంటున్న 288 మంది పరారీలో ఉన్న నిందితులను భారత్‌కు రప్పించినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ సందర్భంగా వెల్లడించింది.

# లోక్‌సభ, అసెంబ్లీలను వెంటనే రద్దు చేయాలి!

**ఎన్నికలన్నీ అక్రమమన్న మల్లికార్జున ఖర్గే**

**బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ పోలింగ్ జరపాలి**

**మోదీ అక్రమ ప్రధాని.. కేంద్రంపై ధ్వజం**

**ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ**

**అక్టోబర్ 6న ఈసీ ఆఫీస్‌కు ఎంపీల ర్యాలీ**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** దేశంలో జరిగిన ఎన్నికలన్నీ పూర్తిగా అక్రమమని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుత లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వంపై సంచలన విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే కొనసాగుతోందని ఖర్గే ఆరోపించారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ హోంమంత్రి. దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆయా పదవుల్లో కొనసాగుతున్నారు. వాటన్నింటినీ వెంటనే రద్దు చేయాలి. ఈవీఎంలను పక్కనపెట్టి, కేవలం బ్యాలెట్ పత్రాల ద్వారానే నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి" అని ఖర్గే డిమాండ్ చేశారు. ఈవీఎంల భారీ దుర్వినియోగంతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్ - ఎస్ఐఆర్) ప్రక్రియలో విపరీతమైన అవకతవకలు జరిగాయని ఖర్గే ధ్వజమెత్తారు. కొన్ని నిర్దిష్ట వర్గాల ప్రజల పేర్లను ఓటర్ల జాబితా నుంచి పథకం ప్రకారం తొలగించే కుట్రలు సాగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)తో పాటు 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పక్షాలతో కూడా విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. ఎన్నికల అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు శ్రీకారం చుడుతున్నట్లు ఏఐసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యాలయానికి భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓట్ల గల్లంతు, ఎన్నికల అక్రమాలపై దేశవ్యాప్తంగా యువతను చైతన్యపరుస్తామని ఖర్గే హెచ్చరించారు.



# యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

**సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్**

**యూపీలో సీట్ల పంపకాలపై నెలకొన్న రగడ**

**ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల మధ్య రాజుకున్న వేడి**

**ఉత్తర్‌ప్రదేశ్, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

# స్వచ్ఛతను జీవనశైలిగా మార్చుకోవాలి!

**కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ పిలుపు**

**గుజరాత్‌లోని మజిగామ్‌లో ప్రత్యేక గ్రామసభ**

**పారిశుధ్య కార్మికులకు ఘన సత్కారం**

**దేశవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించిన కేంద్రం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** స్వచ్ఛతను కేవలం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవనశైలిగా మార్చుకోవాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా గుజరాత్‌లోని మజిగామ్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ గ్రామసభలో పాల్గొన్న మంత్రి పాటిల్.. ముందుగా పారిశుధ్య కార్మికులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. చెత్త వేయకూడదని, అలాగే ఇతరులను కూడా వేయనివ్వకూడదని సూచించారు. స్వచ్ఛతా హీ సేవా-2026, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, స్వచ్ఛ సేవా ఆంకలన్‌పై ఈ గ్రామసభలో విస్తృతంగా చర్చించారు. స్వచ్ఛ భారత్ దివస్‌ను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు జలశక్తి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం, 4 అక్టోబర్ 2026

## సంపాదకీయం



# జల సంక్షోభం దిశగా తెలంగాణ!?

### వానకాలం ముగిసినా నిండని జలాశయాలు..

## వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

### రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం లోటు.. 18 జిల్లాల్లో వానల కొరత

**వానాకాలం వెళ్లిపోయింది.. కానీ తెలంగాణకు నీటి టెన్షన్ మొదలైంది. ఈసారి నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని పూర్తిగా కరుణించలేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 615.5 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే రాష్ట్రవ్యాప్తంగా 17 శాతం లోటు. సాంకేతికంగా ఈ లోటు 'సాధారణ' పరిధిలోనే ఉన్నప్పటికీ, జిల్లాలవారీగా చూస్తే పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. మొత్తం 33 జిల్లాల్లో 18 జిల్లాలు లోటు వర్షపాతంతోనే వానాకాలాన్ని ముగించాయి. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. పరిస్థితిని అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడంతోపాటు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయంతోపాటు కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా తలెత్తాయని ప్రభుత్వం పేర్కొంది.**

#### జలాశయాల్లో 331 టీఎంసీల 'లోటు'

అసలు ఆందోళన రిజర్వాయర్ల దగ్గర మొదలవుతోంది. సెప్టెంబర్ 30 నాటికి తెలంగాణ పరిధిలోని కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో కలిపి 503.43 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఇదే రోజున 834.92 టీఎంసీలు ఉన్నాయి. అంటే ఏడాది వ్యవధిలోనే దాదాపు 331.5 టీఎంసీల మేర నిల్వలు తగ్గాయి. కృష్ణా పరిధిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. గతేడాది సెప్టెంబర్ 30న 583.35 టీఎంసీలున్న నిల్వలు ఈసారి 323.37 టీఎంసీలకు పడిపోయాయి. గోదావరి పరిధిలో 251.57 టీఎంసీల నుంచి 180.06 టీఎంసీలకు తగ్గాయి. కొత్తగా భారీ వరద ప్రవాహాలు రాకపోతే అందుబాటులో ఉన్న నీటిని వచ్చే వానాకాలం వరకు అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉందని జలవనరుల వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

#### భూమిలోనూ నీటి 'అలారం'

పైపైన జలాశయాలే కాదు.. భూమి లోపల కూడా నీటి పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపక్కల జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు గతేడాదితో పోలిస్తే భారీగా దిగజారాయి. హైదరాబాద్‌లో గతేడాది సెప్టెంబర్‌లో సగటున 3.57 మీటర్ల లోతులో నీరు అందుబాటులో ఉండగా ఈసారి అది 10.01 మీటర్లకు పడిపోయింది. మేడ్చల్-మల్కాజిగిరిలో 11.64 మీటర్లు, రంగారెడ్డిలో 11.74 మీటర్లు, సంగారెడ్డిలో 11.21 మీటర్లు, వికారాబాద్‌లో 11.96 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం చేరింది. రంగారెడ్డి జిల్లాలోనే పరిశీలించిన 84 బావుల సమాచారం ప్రకారం గతేడాది సెప్టెంబర్‌లో సగటు భూగర్భ జలమట్టం 6.31 మీటర్లుగా ఉండగా ఈసారి 11.74 మీటర్లకు దిగింది. 27 మండలాల్లో 26 మండలాల్లో గతేడాదితో పోలిస్తే నీటిమట్టం తగ్గినట్లు భూగర్భ జలవనరుల శాఖ నివేదిక వెల్లడించింది. చెరువు నిండితే బోరుకు ఊపిరి.. చెరువు ఎండితే పల్లెకు కష్టం. వానలు తగ్గడం, చెరువులు పూర్తిస్థాయిలో నిండకపోవడం వల్ల భూగర్భ జలాల పునరుద్ధరణ కూడా దెబ్బతింటోంది. బోరు మరింత లోతుకు వెళ్తే రైతుకు విద్యుత్, మోటారు, నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. బోరు పూర్తిగా వట్టిపోతే పంటను కాపాడుకోవడమే ప్రశ్నార్థకమవుతుంది. ఇప్పటివరకు ప్రధానంగా సాగునీటిపైనే కనిపిస్తున్న ఒత్తిడి రాబోయే నెలల్లో తాగునీటిపైనా పడే ప్రమాదం ఉందని జలవనరుల వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భూగర్భ జలాలు తిరిగి గణనీయంగా పుంజుకునేంత వర్షపాతం లేకపోతే అక్టోబర్ నుంచి వచ్చే వేసవి వరకు నీటి నిర్వహణ కీలకంగా మారనుంది.



# 'వోట్ చోరీ' నుంచి.. 'క్రెడిట్ చోరీ' దాకా!

- ఎన్నికల సంఘంపై పోరు ఎవరిది?..
- కాంగ్రెస్-సీజేపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా వార్
- శివాజీ పార్క్ నిరసన తర్వాత మరింత ముదిరిన మాటల యుద్ధం
- 'ట్విట్టర్‌కే పరిమితమైన లిబరల్ వ్యవస్థ' అంటూ అశుతోష్ రాంకా సెటైర్లు
- 'ప్రజాస్వామ్యాన్ని కాపాడే గుత్తాధిపత్యం ఎవరికీ లేదు' అంటూ సౌరవ్ దాస్ విమర్శ
- 'ఏళ్లుగా పోరాడుతున్నది మేమే' అంటూ కాంగ్రెస్ శ్రేణుల ఎదురుదాడి





**ముంబై, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై మొదలైన 'వోట్ చోరీ' రాజకీయ వివాదం ఇప్పుడు విపక్ష శిబిరంలోనే 'క్రెడిట్ చోరీ' రచ్చకు దారితీసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాకరోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమం నేపథ్యంలో.. ఈ అంశంపై అసలు పోరాటం చేస్తున్నదెవరన్న దానిపై సీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య సామాజిక మాధ్యమాల్లో మాటల యుద్ధం మొదలైంది. 'వోట్ చోరీ' అనేది ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ కాగా, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని తేల్చే స్వతంత్ర నిర్ధారణగా దాన్ని పరిగణించలేం. కాంగ్రెస్ కూడా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ కొంతకాలంగా ప్రచారం నిర్వహిస్తోంది. అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్‌లో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నేతృత్వంలో జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ భారీ నిరసన జరిగింది. ఈ ఆందోళన తర్వాతే విపక్ష వర్గాల మధ్య నాయకత్వం, ఉద్యమానికి దక్కుతున్న ప్రచారంపై విభేదాలు బహిర్గతమయ్యాయి. అంతకుముందే సీజేపీ దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునివ్వగా, కాంగ్రెస్ మాత్రం 'వోట్ చోరీ' ఆరోపణలపై విడిగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి.

#### 'లిబరల్స్ వ్యవస్థ యాక్టివేట్ అయింది'

దీప్కేకు లభిస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక కొందరు 'స్వయం ప్రకటిత లిబరల్స్' ఆయనను లక్ష్యంగా చేసుకుంటున్నారని సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రాంకా విమర్శించారు. ఈ వర్గం సామాజిక మాధ్యమాలకే పరిమితమై ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యాన్ని తామే కాపాడుతున్నామన్న భావనతో వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. మరో సహ కన్వీనర్ సౌరవ్ దాస్ కూడా ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత తమదేనన్నట్లుగా ఓ వర్గం వ్యవహరిస్తోందని విమర్శించారు. అయితే వీరిద్దరూ తమ వ్యాఖ్యల్లో కాంగ్రెస్ పేరును నేరుగా ప్రస్తావించలేదు.

#### 'పోరాటానికి క్రెడిట్ కొట్టేస్తున్నారా?'

సీజేపీ నేతల వ్యాఖ్యలకు కాంగ్రెస్ వర్గాల నుంచి ఎదురుదాడి మొదలైంది. అసోంలో ఇటీవల అశుతోష్ రాంకా సహా సీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు కాంగ్రెస్ నేతలు సాయం చేశారని అసోం కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతమ్ సింగ్ పేర్కొన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నేతలను మర్యాదపూర్వకంగా కలిసేందుకు కూడా సీజేపీ ప్రతినిధులు నిరాకరించారని ఆయన ఆరోపించారు. 'వోట్ చోరీ' ఆరోపణలను రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఇప్పటికే లేవనెత్తుతున్నాయని ఆ పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. రాహుల్‌గాంధీ సెప్టెంబర్‌లోనూ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా ఇటీవల ఎన్నికల జాబితాల సవరణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సీఈసీ రాజీనామా డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. దీంతో ఎన్నికల సంఘంపై విపక్షాల పోరు ఇప్పుడు మరో ఆసక్తికర రాజకీయ మలుపు తీసుకుంది. ఒకవైపు సీజేపీ వీధి ఉద్యమాన్ని ముందుకు తెస్తుండగా.. మరోవైపు ఈ అంశాన్ని తాము ముందుగానే లేవనెత్తామని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల సంఘంపై మొదలైన 'వోట్ చోరీ' ఆరోపణల పోరు.. చివరకు విపక్షాల మధ్య 'క్రెడిట్ ఎవరిది?' అన్న సోషల్ మీడియా సమరంగా మారింది.. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కూడా గాంధీ స్మృతిని దర్శించి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్ముడు పోషించిన చా రిత్రాత్మక పాత్రను, ఆయన అందించిన సామాజిక సామ రస్య సందేశాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు. అంతకుముందు రాజ్‌ఘాట్‌లోని గాంధీజీ సమాధిని సం దర్శించి పూలమాలలతో నివాళులర్పించి, అక్కడ జరిగిన సర్వధర్మ ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం భారత మా జీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని విజయ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. 1964 నుంచి 1966 వరకు భారత ప్రధానిగా సేవలందించిన శాస్త్రి, 1965 ఇండో-పాక్ యుద్ధ సమయంలో దేశానికి అందించిన సమర్థవంతమైన నాయకత్వాన్ని, ఆయన ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదాన్ని, పాటించిన ఉన్నత విలువలను ప్రధాని కొనియాడారు. 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల ద్వారా భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన తీరు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. గాంధీజీ జయంతిని ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, గాంధీజీ మరియు లాల్ బహదూర్ శాస్త్రుల దివ్య స్మృతికి దేశవ్యాప్తంగా నాయకులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.

# ఫ్లైదుబాయ్ ఘటన.. 'ఉగ్రవాద చర్యే'!

- కోపైలట్ ఉగ్రదాడికి యత్నించినట్లు యూఏఈ అటార్నీ జనరల్ వెల్లడి
- క్రాష్ యాక్స్‌తో కెప్టెన్‌పై దాడి.. విమాన నియంత్రణను చేజిక్కించుకునే ప్రయత్నం
- ఉద్దేశాలు, సంబంధాలపై ఇంకా కొనసాగుతున్న సమగ్ర దర్యాప్తు
- తీవ్రంగా గాయపడినా పెను ప్రమాదాన్ని తప్పించిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్



**అబుదాబి, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జడ్-1073లో చోటుచేసుకున్న ఘటనపై కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. విమాన కోపైలట్ ఉగ్రవాద చర్యకు ప్రయత్నించినట్లు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో తేలిందని యూఏఈ అటార్నీ జనరల్ డాక్టర్ హమద్ సైఫ్ అల్ షమ్సీ అధికారికంగా వెల్లడించారు.

#### కాక్‌పిట్‌లో క్రాష్ యాక్స్‌తో దాడి

విమానం గాల్లో ఉండగానే కోపైలట్ తన ప్రణాళికను అమలు చేయడం ప్రారంభించినట్లు అల్ షమ్సీ తెలిపారు. కాక్‌పిట్‌లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే క్రాష్ యాక్స్‌తో కెప్టెన్‌పై దాడి చేసి, విమాన నియంత్రణ వ్యవస్థలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ పెను ప్రమాదాన్ని నివారించడంలో కీలకంగా వ్యవహరించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లించి సురక్షితంగా దించారు.

#### కుట్ర కోణంపై ఇంకా విచారణ

అయితే ఈ ఘటన వెనుక పూర్తి ఉద్దేశాలు, ఇతరులతో సంబంధాలు ఉన్నాయా, ముందస్తు ప్రణాళిక ఎంతవరకు ఉందన్న అంశాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. భౌతిక, డిజిటల్ ఆధారాలతోపాటు సాంకేతిక అంశాలను అధికారులు విశ్లేషిస్తున్నారు. అన్ని దర్యాప్తు ప్రక్రియలు పూర్తయిన తర్వాత తుది ఫలితాలను ప్రకటిస్తామని యూఏఈ అటార్నీ జనరల్ స్పష్టం చేశారు.

# 'రక్షణ కవచాలు'గా మైనర్లు..

### సీజేపీ నిరసనలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు!

**ముంబై, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 02న ముంబై శివాజీ పార్క్‌లో నిర్వహించిన నిరసనల్లో మైనర్ పిల్లలను 'రక్షణ కవచాలు'గా ఉపయోగించారనే ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా విచారణ చేపట్టింది. సతీష్ వైద్ ఫిర్యాదుతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలను ఆధారంగా చేసుకుని కమిషన్ ఈ చర్యలు తీసుకుంది. పోలీసుల చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు మైనర్లను నిరసనల్లోకి తెచ్చారనే ఆరోపణలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా స్పందించింది. ముంబై పోలీస్ కమిషనర్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఎక్స్ కార్ప్, మహారాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులు, డిజిటల్ ఆధారాలను పరిశీలించి, నేరం రుజువైతే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ముంబై పోలీసులను ఆదేశించింది. జువైనల్ జస్టిస్ చట్టం ఉల్లంఘనపై దర్యాప్తు జరిపి వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది.

# ఉద్యమాలన్నింటికీ ఒకే 'డిజిటల్ అడ్డా'!

- 'సత్యాగ్రహ' వేదికను ప్రారంభించిన రాహుల్‌గాంధీ
- దేశవ్యాప్తంగా సాగుతున్న పోరాటాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకొచ్చే ప్రయత్నం
- సమస్యను నమోదు చేస్తే.. అదే అంశంపై పోరాడుతున్న వారితో అనుసంధానం
- 'ఒంటరి గొంతు అణచివేతకు గురికావచ్చు.. కలిసిన గొంతుకలకు బలం'
- పార్లమెంట్ నుంచి వీధుల వరకు అండగా ఉంటానన్న విపక్ష నేత



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** దేశంలో వివిధ సమస్యలపై విడివిడిగా పోరాడుతున్న ప్రజలు, సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. 'సత్యాగ్రహ' పేరుతో రూపొందించిన డిజిటల్ వేదికను శనివారం ప్రారంభించారు. మహాత్మాగాంధీ జయంతి మరుసటి రోజే ఈ వేదికను అందుబాటులోకి తీసుకురావడం విశేషం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు సహా వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై సాగుతున్న ఉద్యమాల వివరాలను ఈ వేదికలో నమోదు చేసుకోవచ్చు. నమోదైన పోరాటాలను ఇంటరాక్టివ్ మ్యాప్‌లో చూపించడం ద్వారా ఒకే తరహా సమస్యపై దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో పోరాడుతున్న వారు ఒకరినొకరు గుర్తించేందుకు అవకాశం కల్పించాలన్నది దీని ఉద్దేశం.

#### 'ఒంటరిగా పోరాడాల్సిన అవసరం లేదు'

దేశంలో ఎంతోమంది తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పటికీ చాలాసార్లు వారు ఒంటరిగా మిగిలిపోతున్నారని రాహుల్ పేర్కొన్నారు. తమ సమస్య, ఉద్యమానికి సంబంధించిన వివరాలను ప్రజలు ఈ వేదికలో నమోదు చేయాలని కోరారు. అవసరమైన చోట పార్లమెంట్‌లో, వీధుల్లో, లేఖల ద్వారా తనకు సాధ్యమైన సహకారం అందిస్తానని చెప్పారు. ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలకు అండగా నిలవడం తన బాధ్యతగా పేర్కొన్నారు. వేదిక ప్రారంభమైన కొద్ది గంటల్లోనే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు నమోదు కావడం మొదలైంది. మధ్యాహ్నం నాటికి వేదికపై 421 నమోదులు కనిపించగా, విద్యకు సంబంధించిన సమస్యలు అత్యధికంగా ఉన్నట్లు అప్పటి డ్యాష్‌బోర్డ్ వివరాలను ఉటంకిస్తూ నివేదికలు పేర్కొన్నాయి. మహాత్మాగాంధీ అహింసాత్మక పోరాట స్ఫూర్తిని డిజిటల్ యుగానికి అనుసంధానిస్తూ ఈ వేదికకు 'సత్యాగ్రహ' అనే పేరు పెట్టారు. స్థానికంగా సాగుతున్న ఉద్యమాలను నమోదు చేయడం, ఒకే సమస్యపై పోరాడుతున్న వారిని పరస్పరం అనుసంధానించడం ఈ ప్రయత్నంలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి.

ప్రజలకోసమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం, 4 అక్టోబర్ 2026

## సాగుదారుల సదస్సును విజయవంతం చేయండి

**జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు**



**పెదనందిపాడు అక్టోబర్ 3 (స్పంద న్యూస్) :** ఈ నెల 7 వ తేదీ విజయవాడలో జరగనున్న దేవాదాయ భూముల కౌలు రైతుల, సాగుదారుల సదస్సు జయప్రదం చేయమని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పాశం రామారావులు రైతులను కోరారు.పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామం లోని సదస్సు కరపత్రాన్ని వారు ఆవిష్కరించి, అనంతరం మాట్లాడుతూ ఎలినినో నేపథ్యంలో పంట వేసి దిగుబడి తగ్గి నష్టపోయిన భూములకు కౌలు రాయితీ ,పంట వేయని భూములకు కౌలు రద్దు చేయాలని, మరో సంవత్సరం పండగ వేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ,ముందస్తు కౌలు చెల్లించిన వారికి వడ్డీ కలిపి తిరిగి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.మూడు సంవత్సరాలకు గాకుండా, ఐదు సంవత్సరాలకు ఒకసారి పాటలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి దేవాలయం వద్ద సాగు రైతుల పేర్లు ప్రకటించాలని, దేవాలయ భూములు ఆక్రమణ నుండి కాపాడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.దేవాలయ భూముల్లో ఉన్న సాగుదారులకు రక్షణ కల్పించాలని వారు కోరారు. దేవాలయ భూములు సాగు చేసే కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకులో పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ముందస్తు కౌలు కాకుండా, పంట వచ్చిన తర్వాత కౌలు తీసుకోవాలని, డిపాజిట్ వెయ్యి రూపాయలకి మించరాదని వారు ప్రభుత్వాన్ని కోరారు. దేవాలయ భూముల కౌలు దారులు, సాగు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని, కౌలు రేట్లు పెరిగాయని, ఎరువులు, పురుగు మందులు,విత్తనాలు ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. ఎరువులు యాప్ ద్వారా యూరియా ,డి.ఎ.పి. సరిపడినంత ఇవ్వకపోవడం వలన కౌలు రైతులకు ఇబ్బందిగా ఉందని ,అందువలన కవులు రైతులందరికీ యాప్ తో నిమిత్తం లేకుండా, వేసిన పొలానికి సరిపడా ఎరువులు, పురుగుమందులు,విత్తనాలు సబ్సిడీతో ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు .దేవాలయ భూముల కౌలు రైతుల రాష్ట్ర సదస్సు ఈనెల ఏడో తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, ఈ సదస్సులో దేవాలయ భూముల కౌలు రైతులు, సాగుదారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు రైతులను కోరారు. ఈ సమావేశంలో కౌలు రైతులు కన్నెగంటి చందర్రావు,పాటిబండ్ల నాగరాజు, కోటయ్య చౌదరి, బండి నాగరాజు, దొప్పలపూడి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ వృద్ధుల దినోత్సవ కార్యక్రమం



**యడ్లపాడు అక్టోబర్ 3 స్పంద న్యూస్:** తిమ్మాపురం కొత్తపాలెం కాలనీలో నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు మాట్లాడు తూ ప్రతి సంవత్సరము అక్టోబర్ 1వ తేదీన నిర్వహించబడుతుంది. వృద్ధులపట్ల నేటితరం వ్యవహార శైలిని పరిగణంలోకి తీసుకొని అంత ర్జాతీయ స్థాయిలో ఈ సమస్యను చర్చించి వృద్ధుల దినోత్సవం జరుపు కోవలసిన అవశ్యకతను గుర్తించారు. 2026 ప్రపంచ వృద్ధుల అంత ర్జాతీయ వృద్ధుల దినోత్సవం థీమ్. దీర్ఘాయువు యుగం:- సుదీర్ఘ జీవితాల కోసం వ్యవస్థలను పునరాలోచించటం పై అవగాహన ఈ యొక్క కార్యక్ర మంలో నరేంద్ర సువర్ణ కుమారి పౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణ కుమారి, ఉపఅధ్యక్షుడు వై. ప్రసాదరావు, కొత్తపాలెం కాలనీ వృద్ధులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట కు అరుదైన గౌరవం

**-సీఎం చంద్రబాబు చేతుల మీదుగా 'స్వచ్ఛ మున్సిపాలిటీ' అవార్డు అందుకున్న కమిషనర్ శ్రీహరి బాబు**



**చిలకలూరిపేట అక్టోబర్ 3 స్పంద న్యూస్ :** విజయవాడ వేదికగా జరిగిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో చిలకలూరిపేట మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, పర్యావ రణ హితమైన విధానాలను అమలు చేయడంలో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గాను రాష్ట్ర ప్రభుత్వం చిలకలూరిపేటను 'స్వచ్ఛ మున్సిపాలిటీ' అవార్డుకు ఎంపిక చేసింది.ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మున్సిపల్ కమి షనర్ పి. శ్రీహరి బాబు సగర్వంగా అందుకున్నారు. విజయవాడలో జరి గిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో, సీఎం చంద్రబాబు నాయుడు కమిష నర్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ ఈ జ్ఞాపికను మరియు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటికీ చెత్త సేకరణ, పచ్చదనం పెంపొందించడం వంటి విభాగాల్లో పేట మున్సిపాలిటీ అద్భుతమైన ప్రగతిని సాధించింది. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు సమర్థవంతమైన నాయకత్వంలో అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, మరియు పట్టణ పౌరుల సమష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైంది.ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం పట్ల పట్టణ పరిధిలో వాసులు, మున్సిపల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పురస్కారం తమ బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో చిలకలూరిపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ఈ అవార్డు ఎంతో స్ఫూర్తినిస్తుందని మున్సిపల్ వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి.

# కృష్ణ కిషోర్ సేవలు చిరస్మరణీయం

**ఆది శైవ అర్చక సంఘానికి తీరని లోటు**

**ఒంగోలులో ఘనంగా సంతాప సభ**




**ఒంగోలు, అక్టోబర్ 03 (స్పంద న్యూస్):** ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘం రాష్ట్ర కోశాధికారి మురికిపూడి కృష్ణ కిషోర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన మృతి ఆది శైవ అర్చక సంఘానికి తీరని లోటని పేర్కొన్నారు. కృష్ణ కిషోర్ సంతాప సభను శనివారం ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులోని ఆయన స్వగృహంలో ప్రకాశం జిల్లా ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.సభకు ప్రకాశం జిల్లా ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు మాధవ శర్మ అధ్యక్షత వహించారు. తొలుత కృష్ణ కిషోర్ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. అనంతరం కొద్దిసేపు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కృష్ణ కిషోర్ సంఘానికి అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన సేవలను సంఘం ఎప్పటికీ మరచిపోదని, ఆయన చిరస్మరణీయుడిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు యనమండ్ర సత్య సీతారామ శర్మ (మరమళ్ళ రాంబాబు) మాట్లాడుతూ.. కృష్ణ కిషోర్ మరణం ఆది శైవ సంఘానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కిషోర్ తనకు కుడి భుజం లాంటి వారని, ఆయనను కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. కృష్ణ కిషోర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఆయన కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి కొల్లిపర నాగ కోటేశ్వర శర్మ మాట్లాడుతూ.. ఆది శైవ అర్చక సంఘంలో మహిళలను ప్రోత్సహించడంలో కృష్ణ కిషోర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మహిళల పట్ల ఆయనకు ఉన్న గౌరవం, సంఘ సభ్యుల పట్ల ఆయన చూపిన ఆదరణ ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని అన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులు అప్పయ్య గురుకుల్ కృష్ణ కిషోర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ఆర్. కృష్ణ మాట్లాడుతూ.. సంఘం కోసం కృష్ణ కిషోర్ చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని అన్నారు.

**కుటుంబానికి సంఘీభావం**

సంతాప సభకు ముందుగా రాష్ట్ర అధ్యక్షులు యనమండ్ర సత్య సీతారామ శర్మ (మరమళ్ళ రాంబాబు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అప్పయ్య గురుకుల్, రాష్ట్ర కార్యదర్శులు కొల్లిపర నాగ కోటేశ్వర శర్మ, కె.ఎస్.ఆర్. కృష్ణ తదితరులు కృష్ణ కిషోర్ భార్యను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘం కృష్ణ కిషోర్ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘం నాయకులు, పుర ప్రముఖులు, కృష్ణ కిషోర్ బాల్య స్నేహితులు, బంధుమిత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కృష్ణ కిషోర్‌తో తమకున్న అనుబంధాన్ని, చిన్ననాటి జ్ఞాపకాలను, ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొని కృష్ణ కిషోర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## కాజా, ఎర్రబాలెంలో

# ఘనంగా అంగన్ మిలన్ ఉత్సవాలు

**అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం.. గర్భిణులకు శ్రీమంతం**

**తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి: బీజేపీ నాయకులు**

**మంగళగిరి, అక్టోబర్ 03 (స్పంద న్యూస్):** మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కాజా, ఎర్రబాలెం గ్రామాల్లో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్ మిలన్ సేవా--అంగన్‌వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా బీజేపీ మహిళా మోర్చా, కిసాన్ మోర్చాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లను సన్మానించడంతో పాటు గర్భిణీ మహిళలకు శ్రీమంతం వేడుక నిర్వహించి పసుపు, కుంకుమ అందజేశారు.

**కాజాలో..**

కాజా గ్రామంలో బీజేపీ మంగళగిరి రూరల్ అధ్యక్షుడు వడిగా గోవర్ధన మణికంఠ, గ్రామ బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు బిట్రా శివనారాయణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శనక్కాయల రాధా మాధవి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తుళ్లిమిల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బిట్రా శివనారాయణ మాట్లాడుతూ.. గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలను పాటించాలని సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. డాక్టర్ శనక్కాయల రాధా మాధవి మాట్లాడుతూ.. గర్భిణీ మహిళలకు సరైన పోషకాహారం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ఆరోగ్యంపై అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నడ్డి నాగమల్లీశ్వరి మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం, శిశువుల పోషణ, బాలల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు వంగిపురపు విమల, జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కో-కన్వీనర్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కాంద్రు భాను కిషోర్, రాష్ట్ర ఓబీసీ మీడియా కన్వీనర్ కోవిల్కార్ రాకేష్, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి మేకల లక్ష్మణ్, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి తుళ్లిమిల్లి రామకృష్ణ, రాష్ట్ర యువ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి కొండా నవనీత్ కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కుర్రాకుల బాపయ్య, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కాసు శ్రీదేవి, టీడీపీ గ్రామ అధ్యక్షులు విక్రమ్ బాబు, జనసేన గ్రామ అధ్యక్షులు అప్పికట్ల వెంకటరత్నం, ఐసీడీఎస్ సెక్టార్ ఇన్‌చార్జి నిర్మల, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శులు గాదె విజయభాస్కర్‌రెడ్డి, బొమ్ము పిచ్చిరెడ్డి, ఓబీసీ అధ్యక్షులు కర్ణ రోశయ్య, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అప్పికట్ల శివయ్య, మహిళా నాయకురాళ్లు ఎ. బసవపున్నమ్మ, కుర్రకుల సుకన్య, ఐసీడీఎస్ హెడ్ సరిత తదితరులు పాల్గొన్నారు.



**ఎర్రబాలెంలోనూ అంగన్ మిలన్ ఉత్సవాలు**

ఎర్రబాలెం గ్రామంలోనూ అంగన్ మిలన్ ఉత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లను సన్మానించడంతో పాటు గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శనక్కాయల రాధా మాధవి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆకుల జయ సత్య, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తుళ్లిమిల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు అంగన్‌వాడీ టీచర్లు, మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైనప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు మణికంఠ, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు వంగిపురపు విమల, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కాసు శ్రీదేవి, రాష్ట్ర ఓబీసీ మీడియా కన్వీనర్ కోవిల్కార్ రాకేష్, సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కో-కన్వీనర్ కాంద్రు భాను కిషోర్, అడ్వకేట్ శర్మ, టీడీపీ గ్రామ అధ్యక్షు లు అంకారావు, టీడీపీ నాయకురాలు గడ్డం లక్ష్మీ సామ్రాజ్యం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గాదె విజయభాస్కర్‌రెడ్డి, ఐసీడీఎస్ సెక్టార్ ఇన్‌చార్జి నిర్మలతో పాటు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవేపై ప్రమాదకర ఫ్లెక్సీలను తొలగించండి

**నితిన్ గడ్కరీకి మాదాసు భాను ప్రసాద్ లేఖ**

చిలకలూరిపేట అక్టోబర్ 3 స్పంద న్యూస్ : జాతీయ రహదారిపై ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న అక్రమ ఫ్లెక్సీలను తక్షణమే తొలగించి, శాశ్వత నియంత్రణ చర్యలు చేపట్టాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఉయ్ ది పీపుల్ అఫ్ ఇండియా కన్వీనర్, సామాజికవేత్త, మాదాసు భాను ప్రసాద్ లేఖ రాశారు.ఆగస్టు 27న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన తరువాత కూడా రోడ్డు ప్రమాదాల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారని కనుక రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అధికారులు కంటి తడుపు చర్యలతో పరిష్కారాలు కావని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.కూడళ్లు, మలుపులు, కార్నర్ ప్రాంతాల్లోని భారీ ఫ్లెక్సీలు వాహనదారుల దృష్టికి ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు.నెల రోజుల క్రితం అధికారులు హైవేను పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ప్రమాదకర ఫ్లెక్సీలపై తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.నేషనల్ హైవే దూర సూచిక బోర్డులపైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయాన్ని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.అనుమతి లేకుండా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను నియంత్రించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.వీధి దీపాలు వెలగడం లేదని, స్పీట్ బ్రేకర్స్ పై జీబ్రా గీతలు, రోడ్ మార్కింగ్స్, హెచ్చరిక బోర్డులు, ఏర్పాటు చేయాలని కోరారు. చిలకలూరిపేట జాతీయ రహదారిపై భద్రతా పరిస్థితులను పునఃసమీక్షించి, తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశించాలని నితిన్ గడ్కరీని కోరారు. ఈ కార్యక్రమంలో కందా భాస్కర్, హరి ప్రసాద్, అడప రవి, మరుకొండ వెంకటరావు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రైతుల భూ హక్కులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య**

చీరాల అక్టోబర్ 3 ( స్పంద న్యూస్ ): రైతుల భూ హక్కులకు మరింత భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డులను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. శనివారం స్థానిక రూరల్ మండలం బుర్లవారిపాలెం గ్రామంలో నిర్వహించిన మీ భూమి – మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసిన సందర్భంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులకు తమ భూములపై హక్కులకు సంబంధించి స్పష్టమైన భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం పెంచడంతో పాటు అర్హులైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సేవలను మరింత సులభతరం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రీసర్వే, భూ రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియల అనంతరం అర్హత కలిగిన రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పాసు పుస్తకాలు రైతులకు భూమి హక్కులకు సంబంధించిన ముఖ్యమైన పత్రంగా ఉపయోగపడతాయని పాసు పుస్తకాల్లో నమోదైన వివరాలను రైతులు పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవచ్చని తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.



# బడిబాటలో పేద బిడ్డలకు 'సైకిల్' భరోసా!



**పేద విద్యార్థులకు 150 సైకిళ్ల పంపిణీ..**

**త్వరలో 20 కంప్యూటర్లతో హైటెక్ ల్యాబ్**

**టిడిపి కార్యాలయంలో 30 సైకిళ్ళు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చదలవాడ**

**నరసరావుపేట అక్టోబర్ 03 (స్పంద న్యూస్):** పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి అన్ని విధాలా అండగా నిలిచి నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల ఆలోచనల మేరకు అమలు చేస్తున్న 'పి4' విధానంలో భాగంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు, దాతల సహకారంతో నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా 'భారత్ ఫౌండేషన్' చైర్మన్ సజ్జా వెంకటేశ్వర్లు, ప్రతినిధుల సహకారంతో నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 150 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నూతన సైకిళ్లను పంపిణీ చేశారు. వీటిలో కోటప్పకొండ వద్దనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు 120 సైకిళ్లు అందజేయగా, నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మిగిలిన 30 సైకిళ్లను పేద విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలు, నిరుపేద వర్గాల పిల్లల చదువులకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటానని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద రైతులు, వ్యవసాయ కూలీల బిడ్డలు దూరప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త సైకిళ్లు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న వారికి ఈ సాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా బడులకు వెళ్లి చదువులో రాణించేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థుల కోసం తల్లికి వందనం, స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్స్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సీఎస్సార్ నిధులు, దాతల తోడ్పాటుతో 20 కంప్యూటర్లతో కూడిన హైటెక్ ల్యాబ్‌ను త్వరలోనే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతల సాయంతో 14 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి సురక్షిత తాగునీరు అందిస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థుల సంక్షేమం, ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇరికేపల్లి లో అంగన్వాడీ ఉత్సవాలు

**దాచేపల్లి, అక్టోబరు 3(స్పంద న్యూస్):** అంగన్వాడీ వ్యవస్థ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 7 వ తేదీ వరకు నిర్వహించనున్న అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా శనివారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి లో అంగన్వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నడికుడి సెక్టార్ సూపర్ వైజర్ వరలక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి గర్భిణీలు, బాలింతలు, ఐదేళ్లు లోపు చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అందిస్తున్న పోషక అహారాన్ని తల్లులకు వివరించారు. ముఖ్యం గా గర్భిణీలు, బాలింతలకు రక్తహీనత సమస్య లేకుండా గుడ్డు, పాలుతో పాటు రాగిపిండి, బలవర్ధకమైన ఆహారం కోసం పప్పులు అందజేయటం జరుగుతుందన్నారు.

అధేవిదంగా చిన్నారులకు గుడ్డు, పాలు, వేరుశనగ చిక్కీలతో పాటు భోజనం అందించడం జరుగుతుందన్నారు. అంతేగాకుండా చిన్నారులకు ఐసిడిఎస్ ద్వారా అందించే బొమ్మలతో ఆట పాటలతో కూడిన భోధన చేయటం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పేద మహిళలు, చిన్నారులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తుందని చిన్నారుల తల్లులకు వివరించారు. అనంతరం అంగన్వాడీ ఫ్లెక్సీ లతో ఇరికేపల్లి లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులు అంగన్వాడీ కార్యకర్తలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుధారాణి, మాధురి, పద్మ, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు సత్యవతి, మమత పాల్గొన్నారు.



# శంకర్ విలాస్ ఫ్లైఓవర్ పనులతో ట్రాఫిక్ మళ్లింపు

**శంకర్ విలాస్ సెంటర్‌లో అండర్‌పాస్ నిర్మాణం..**

**ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచన**

**గుంటూరు, అక్టోబర్ 03 (స్పంద న్యూస్):** గుంటూరు నగరంలో శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా శంకర్ విలాస్ సెంటర్ జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4 నుంచి బ్రాడీపేట 4వ లైన్ నుంచి అరండల్‌పేట 4వ లైన్ వైపు వెళ్లే మార్గాన్ని పూర్తిగా మూసివేయనున్నట్లు గుంటూరు టౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని ట్రాఫిక్ డీఎస్పీ కోరారు.

**బ్రాడీపేట నుంచి డొంకరోడ్డు వైపు..**

బ్రాడీపేట 1వ, 2వ, 3వ లైన్ల నుంచి డొంకరోడ్డు వైపు వెళ్లే వాహనాలు బ్రాడీపేట 2వ లైన్ మీదుగా అరండల్‌పేట 1వ లైన్, రైల్వే స్టేషన్ ఎదురు రోడ్డు, అరండల్‌పేట 4వ లైన్ మీదుగా డొంకరోడ్డు వైపు వెళ్లవచ్చని తెలిపారు.

**బ్రాడీపేట 4వ లైన్ నుంచి వచ్చే వాహనాలకు..**

బ్రాడీపేట 4వ లైన్ నుంచి వచ్చే వాహనాలు బ్రాడీపేట 4/7వ లైన్, మాజేటి గురవయ్య స్కూల్, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ మీదుగా డొంకరోడ్డు వైపు వెళ్లవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా బ్రాడీపేట 5వ లైన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అండర్‌పాస్‌ను ఉపయోగించుకుని అరండల్‌పేట 5వ లైన్‌లోకి చేరి డొంకరోడ్డు వైపు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

**డొంకరోడ్డు నుంచి బ్రాడీపేట వైపు..**

డొంకరోడ్డు వైపు నుంచి బ్రాడీపేటకు వెళ్లే వాహనాలు అరండల్‌పేట 1వ లైన్, రైల్వే స్టేషన్ మీదుగా బ్రాడీపేట 2వ లైన్ వైపు వెళ్లవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

అలాగే అరండల్‌పేట 5వ లైన్ నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన అండర్‌పాస్ ద్వారా బ్రాడీపేట వైపు వెళ్లవచ్చని తెలిపారు.

**ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి**

అండర్‌పాస్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ మార్గాల్లో మార్పులు చేసినందున ప్రజలు, వాహనదారులు ముందుగానే ఈ విషయాన్ని గమనించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

## ఎస్ డబ్ల్యుపిసి షెడ్‌లో క్లాప్ మిత్రులకు ఎక్స్‌పోజర్ టూర్



**యడ్లపాడు అక్టోబర్ 3 స్పంద న్యూస్ :** మండలం లోని వంకాయలపాడు ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ వద్ద మండల పంచాయతీ అభివృద్ధి అధికారులు, క్లాప్ మిత్రులు,షెడ్ మిత్రులకు చెత్త నిర్వహణపై ఎక్స్‌పోజర్ టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వానపాము ఎరువు తయారీ,నిర్వహణ, బిన్ బ్యాగ్ వినియోగం, తడి--పొడి చెత్తను వేరు చేయడం, స్వచ్ఛ రథం ద్వారా చెత్త సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోయడ్లపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి హేమలతాదేవి,డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ జాకీర్ హుస్సేన్, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ అభివృద్ధి అధికారులు, క్లాప్ మిత్రులు,షెడ్ మిత్రులు పాల్గొన్నారు.

## మాజీ ప్రిన్సిపాల్ మద్ది సత్యనారాయణ కన్నుమూత



**చిలకలూరిపేట అక్టోబర్ 3 స్పంద న్యూస్:** పట్టణంలోని ఎస్ సి వి ఎస్ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మద్ది సత్యనారాయణ (83) శనివారం తుదిశ్వాస విడిచారు. మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, హైదరా బాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూ శారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సత్యనారాయణ ఎస్ సి వీ ఎస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా దాదాపు మూడు దశాబ్దాల పాటు నిబద్ధతతో సేవలందించి, 2006లో పదవీ విరమణ పొందారు. క్రమశిక్షణ గల అధ్యాపకుడిగా, ఉత్తమ నిర్వాహకుడిగా పేరుగాంచిన ఆయన వేలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకుడిగా నిలిచారు. ఆయన మృతి పట్ల పట్టణ ప్రముఖులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం విద్యారంగానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కాంప్యాక్టర్ వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దులూరి



**చీరాల అక్టోబర్ 3 ( స్పందన న్యూస్ ):** మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన కాంప్యాక్టర్ వాహనాన్ని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య ప్రారంభించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ అవరణంలో స్వచ్ఛాంధ్రా కార్పోరేషన్ నిధులు రూ.1.40 కోట్లుతో కొనుగోలు చేసిన వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘంలో రోజువారి పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన 42 క్యూబిక్ మీటర్ కెపాసిటీ కాంప్యాక్టరు వాహనమును కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఈనాటి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డేనియల్, మాజీ మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు శానిటైజేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దాచేపల్లి పోలీస్ స్టేషన్ లో అదనపు ఎస్పీ రోహిత్ తనిఖీలు

**దాచేపల్లి, అక్టోబరు 3(స్పంద న్యూస్ ):** సాధారణ తనిఖీలలో భాగంగా పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ చౌదరి శనివారం గురజాల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని దాచేపల్లి పోలీస్ స్టేషన్ లో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో స్టేషన్ కు చేరుకున్న ఎ ఎస్పీ ముందుగా స్టేషన్ లోని కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలను సి ఐ ఖాజావలిని అడిగితెలుసుకున్నారు. అధేవిదంగా సిబ్బంది పనితీరు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో కలియ తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. ఎ ఎస్పీ తనిఖీల సమయంలో సిఐ షేక్ ఖాజావలి, ఎస్ఐలు పాపారావు, ఖాసీం,ఎ ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం, 4 అక్టోబర్ 2026

## మత్స్యకారులు ఆయిల్ సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలి

**శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య**



**చీరాల అక్టోబర్ 3 ( స్పంద న్యూస్ ) :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ ఆయిల్ సబ్సిడీని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక రూరల్ మండలం బుర్రవారిపాలెం గ్రామంలో అర్హులైన మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన హైస్పీడ్ డీజిల్ ఆయిల్ సబ్సిడీ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేయడం జరిగింది. వాడరేవు గ్రామం లో మొత్తం 235మందికి ఈ కార్డులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ కార్డుల ద్వారా ప్రతి లీటరుకు తొమ్మిది రూపాయలు సబ్సిడీ ప్రభుత్వం ద్వారా లభిస్తుందన్నారు. గరిష్టంగా నెలకు 300లీటర్లకు ఆయిల్ సబ్సిడీ పొందవచ్చని తెలిపారు. వేట వృత్తిని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సేవలో పథకం ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వేట విరామ సమయంలో రూ.ఇరవై వేలు ఆర్థిక సహాయం సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం సద్వినియోగం చేసుకుని వేట వృత్తిపై ఆధారపడిన కుటుంబాల వారు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. తీర ప్రాంత గ్రామాలను సమీకృత మత్స్య సంపద సముదాయంగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు రెవిన్యూ అధికారులు కూటమి నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల రూరల్ నూతన సీఐగా ఎస్. సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

### శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

**ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తా: సీఐ సుబ్బారావు**



**బాపట్ల, అక్టోబర్ 03 (స్పంద న్యూస్):** బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఎస్. సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపడుతూ, పోలీస్ శాఖపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా విధులు నిర్వహిస్తానని సీఐ తెలిపారు. పోలీస్ సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తూ శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తామని చెప్పారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సీఐ సుబ్బారావును పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## తిమ్మాపురం టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడి రాజీనామా

**యడ్లపాడు అక్టోబర్ 3 స్పంద న్యూస్:** మండలంలోని తిమ్మాపురం గ్రామ తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అధ్యక్ష పదవికి బొల్లినేని వీరశేఖర్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామా లేఖను మండల టీడీపీ అధ్యక్షులు కామినేని సాయిబాబాకు పంపించారు. కేవలం వ్యక్తిగత కారణాల వల్లనే తాను గ్రామ టీడీపీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఇంతకాలం పార్టీలో బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం కల్పించిన నాయకత్వానికి ఈ సందర్భంగా వీరశేఖర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పేటలో అక్రమ పీడీఎస్ బియ్యం పట్టివేత



**చిలకలూరిపేట అక్టోబర్ 3 స్పంద న్యూస్:** పట్టణ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం 4:30 గంటల సమయంలో బోసు రోడ్డులోని ఎరువుల గోడౌన్ వెనుక అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో తన్నీరు నాగమ్మ అనే మహిళ అక్రమంగా నిల్వ ఉంచిన 12 బస్తాల (మొత్తం ఆరు క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినందుకు గాను సదరు మహిళపై అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో పల్నాడు జిల్లా అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ షేక్ రోషన్ జమీర్ భాష, డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వర్లు, వీఆర్వో షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

# బుర్రిపాలెంలో పర్యటించిన మంత్రులు,కలెక్టర్





**గుంటూరు, అక్టోబర్ 3 (స్పంద న్యూస్ ):** తెనాలి మండలం బుర్రిపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం పర్యటిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సీబా రాణి కొర్లపాటి, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ శనివారం బుర్రిపాలెంలో పర్యటించారు.

ముఖ్య మంత్రితో పాటు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నత అధికారులు పాల్గొంటున్నారు.

అక్టోబర్ 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు పి.ఎం.ఏ.వై గ్రామీణ్ క్రింద మంజూరైన గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. బుర్రిపాలెం గ్రామం పొలిమేరల్లో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బహిరంగ సభకు హాజరు అయ్యే ప్రజలు, అధికారులు కూర్చొనుటకు ఏర్పాట్లు చేశారు. తాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఎ.టి.వి రవి కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డి.ఎస్పీ బి.జనార్ధన రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహనిర్మాణసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఓవరాల్ ఛాంపియన్ గా దుర్గా పబ్లిక్ స్కూల్



**దాచేపల్లి, అక్టోబరు 3(స్పంద న్యూస్ ):** రెండు రోజుల క్రితం పల్నాడు జిల్లా బ్రహ్మణపల్లి గీతికా సిబిఎస్ఇ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎక్కువ పోటీలలో గెలుపొంది ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ మల్లిఖార్జున శాస్త్రి తెలిపారు.కేవలం సిబిఎస్ఇ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే నిర్వహించిన ఈ పోటీలలో దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి అత్యధిక పోటీలలో విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. కబడ్డీ, ఖోఖో, త్రో బాల్,బాల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొందినట్లు ఆయన తెలిపారు.మొత్తం 23 క్రీడాంశల్లో 660 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో 13 పతకాలు, రెండు ట్రోఫిలను గెలుచుకొని ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గెలుపొందిన విజేతలను దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు కొంకా రాధ అభినందించగా, పల్నాడు జిల్లా బిజెపి అధ్యక్షులు యేలూరి శశికుమార్ విజేతలకు బహుమతులందజేశారు. క్రీడలలో గెలుపొందిన విద్యార్థులను సాగర్ సిమెంట్స్ యాజమాన్యం, దుర్గా పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

## దీపావళి నాటికి నందివెలుగు ఆర్ఓబీ అందుబాటులోకి

### పనులను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలి : కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** దీపావళి నాటికి నందివెలుగు రోడ్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ)ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం నగర కమిషనర్ కె. మయూర్ అశోక్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, రైల్వే, జీఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన ఆర్ఓబీ పనులను పరిశీలించారు. 2013–14లో మంజూరై, 2017లో ప్రారంభమైన పనులు గత కొంతకాలంగా నిలిచిపోవడంతో సుమారు రూ.39 కోట్లతో రీ–టెండర్ నిర్వహించి పనులను పునఃప్రారంభించినట్లు తెలిపారు.ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయని, డిసెంబర్ 15 వరకు గడువు ఉన్నప్పటికీ అదనపు సిబ్బంది, సబ్ కాంట్రాక్టర్లను వినియోగించి అంత కంటే ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. గ్రావెల్ కొరత, గుడి వద్ద ట్రాఫిక్ సమస్యలను స్థానిక నాయకులతో సమన్వయంతో పరిష్కరిస్తున్నామని తెలిపారు. పనుల కోసం రైల్వే గేట్‌ను రెండు రోజుల పాటు మూసివేసి పనులు పూర్తి చేయడంతో పాటు, జీఎంసీ సహకారంతో బ్రిడ్జి కింది ప్రాంతాన్ని సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పెమ్మసాని వెల్లడించారు.

## నాయీబ్రాహ్మణుడు పై దాడి చేసిన దోషులను వెంటనే అరెస్టు చేయాలి

**ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు**

**చిలకలూరిపేట అక్టోబర్ 3 స్పంద న్యూస్:** నాయీబ్రాహ్మణ సంఘీయుడైన ఎం రవిచంద్ర పై గుర్తు తెలియని వ్యక్తులు నడిరోడ్డుపై ముసుగులు వేసుకొని వచ్చి భౌతిక దాడి చేయడం అత్యంత దుర్మార్గమని ఈ దాడి హేయమైన చర్యని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు తీవ్రంగా ఖండించారు. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఈ దాడి విషయంలో దోషులను వెంటనే అరెస్టు చేయాలని నాయి బ్రాహ్మణులపై ఈ విధమైన దాడులు పునరా వృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకో వాలని ప్రభుత్వాన్ని నరసింహారావు విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలో ఊరి నడిబొడ్డున ఉద్దేశపూర్వకంగా ముసుకులు వేసుకొని వచ్చి దాడి చేయడం పిరికిబంద చర్యని, పోలీసులు దోషులను వెంటనే అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా న్యాయ పోరాటా నికి సిద్ధం పడాల్సి వస్తుందని నరసింహారావు పేర్కొన్నారు. గత దశాబ్దాల కాలం నుండి నాయీబ్రా హ్మణులపై దాడులు హత్యలు అత్యాచారయత్నాలు అధికమవుతున్న దృష్ట్యా నాయీబ్రాహ్మణులకు రక్షణ చట్టం కావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ నేటికీ అమలు కాలేదని ఆవేదన చెందారు. ఈ భౌతిక దాడిని ఖండించిన వారిలో నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నేపాటి నరేష్ గుంటూరు జిల్లా జేఏసీ అధ్యక్షులు కొండూరు అంకమ్మరావు గుంటూరు అర్బన్ కమిటీ ఆర్గనైజర్స్ కే బతేశ్వరరావు అద్దంకి రవి గంగాధర్ భాస్కర్ తదితరులు ఉన్నారు.



## బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌పై కూటమి చిత్తశుద్ధి

### వైసీపీ హయాంలో 20 శాతం.. 34 శాతం కోసం కూటమి ముందడుగు : వేములకొండ శ్రీనివాస్



**గుంటూరు, అక్టోబరు 3 (స్పంద న్యూస్):** బీసీల రాజకీయ సాధికారత కోసం కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ దిశగా తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని గుంటూరు జిల్లా టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1995 నుంచి అమల్లో ఉన్న 20 శాతం రిజర్వేషన్‌ను 34 శాతానికి పెంచేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందని తెలిపారు. 2026 ఆగస్టులో గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్‌కు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొ న్నారు. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ బీసీలకు 34శాతం రిజర్వేషన్ ఎందుకు కల్పించలేదని శ్రీని వాస్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీల రాజకీయ ప్రాతినిధ్యం కోసం రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలు ఓటు బ్యాంకు కాదని, రాష్ట్రానికి వెన్నెముకలాంటి సామాజిక వర్గాలని పేర్కొన్న ఆయన.. విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలతో పాటు రాజకీయ ప్రాతినిధ్యంలోనూ తగిన భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. “బీసీల హక్కులకోసం పోరాటం కొనసాగుతుంది. 34శాతం రాజకీయ ప్రాతి నిధ్యం సాధించాలనే బీసీ సమాజ ఆకాంక్షకు టీడీపీ బీసీ విభాగం అండగా నిలుస్తుంది” అని వేములకొండ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ప్రజాగళమే
స్పందన
జాతీయ తెలుగు దినపత్రిక

ఆదివారం, 4 అక్టోబర్ 2026



# నువ్వుంటేనే కిక్ మరెవరితోనూ ఊహించుకోలేను!'

సినిమా నిర్మాణంలో కథతో పాటు అందులో కలిసి పనిచేసే వ్యక్తులు కూడా చాలా ముఖ్యమని కథానాయిక మాళవిక మోహనన్ పేర్కొన్నారు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ అలరిస్తున్న ఈ భామ, ఇటీవల 'సర్దార్ 2' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం విజయ్ సేతుపతికి జోడీగా 'పాకెట్ నోవెల్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా సినిమా మేకింగ్ ప్రయాణం, విజయ్ సేతుపతితో కలిసి పనిచేసిన అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా ఆమె అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా మాళవిక మోహనన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ.. "కొన్ని సినిమాలు తీస్తున్న సమయంలో అవే ఒక చిన్న ప్రపంచంగా మారిపోతాయి. అలాంటిదే ఈ 'పాకెట్ నోవెల్' చిత్రం. ఈ ప్రాజెక్టులో భాగమైనందుకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా ప్రయాణంలో నేను నేర్చుకున్న ముఖ్యమైన విషయం ఏమిటంటే.. కేవలం నటన మాత్రమే కాదు, ఎవరితో కలిసి పనిచేస్తున్నామనేది కూడా అంతే ముఖ్యం. ఓ చిత్ర బృందంతో కలిసి నెలల తరబడి గడుపుతాం. ప్రతిరోజూ ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ కష్టసుఖాలను పంచుకుంటాం. అలా తెలియకుండానే ఆ టీమ్ ఒక కుటుంబంలా మారిపోతుంది" అని పేర్కొన్నారు. అలాగే నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసలు కురిపిస్తూ.. "అద్భుతమైన నటుడైన విజయ్ సేతుపతితో కలిసి నటించడం ఓ గొప్ప అనుభవం. ఆయనతో తప్ప ఈ సినిమా ప్రయాణాన్ని మరెవరితోనూ ఊహించుకోలేను" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం మాళవిక చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.



# బన్నీ-అట్లీ సినిమాలో నేను లేను!

## 'రాకా'లో నెగెటివ్ రోల్ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి క్లారిటీ

**హైదరాబాద్, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్--దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ చిత్రంలో తాను నటిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంపై మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నెగెటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రలో ఐశ్వర్య కనిపించనున్నారంటూ కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుండగా.. అందులో నిజం లేదని ఆమె తేల్చేశారు. తాను ఈ ప్రాజెక్టులో భాగమే కాదని ఐశ్వర్య స్పష్టం చేశారు. ఈ ప్రచారం తొలిసారి చూసినప్పుడు ఆశ్చర్యంతోపాటు నవ్వు వచ్చిందని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా 'అసలు ఆ సినిమాలో నేనే లేను.. ఎవరైనా నాకు ఈ ప్రాజెక్టులో అవకాశం ఇప్పిస్తే బాగుంటుంది' అంటూ సరదాగా స్పందించారు. దీంతో ఆమె నెగెటివ్ పాత్రలో నటిస్తున్నారన్న ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడింది. అట్లీ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కథలో నాలుగు కీలక మహిళా పాత్రలు ఉంటాయనే వార్తలూ వినిపిస్తున్నాయి. ప్రధాన పాత్ర కోసం దీపికా పదుకొణె పేరు బలంగా ప్రచారంలో ఉండగా, ఫెమినా జార్జ్ మరో కీలక పాత్రకు ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి. జాన్వీ కపూర్, రష్మిక మందన్న పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ వీటిపై చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. 'పుష్ప' చిత్రాలతో అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా వచ్చిన ఆదరణ, 'జవాన్'తో అట్లీ సాధించిన భారీ విజయం నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే చిత్రానికి 'రాకా' అనే టైటిల్, నలుగురు కథానాయికలు, ఇతర తారాగణం గురించి జరుగుతున్న ప్రచారంలో ఏది అధికారికమో చిత్రబృందం ప్రకటించిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# మాజీ మహిళా మావోయిస్టులకు బాలీవుడ్ చాన్స్!







**రాయ్‌పూర్, అక్టోబర్ 03 (స్పంద న్యూస్):** హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు బాలీవుడ్‌లో నటించే అరుదైన అవకాశం లభించింది. ఇటీవల ఓ ఫ్యాషన్ షోలో వారు ప్రదర్శించిన ర్యాంప్ వాక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, చిత్ర పరిశ్రమ దృష్టిని ఆకర్షించడంతో ఈ ఆఫర్ వారిని వరించింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన ఈ తొమ్మిది మంది మహిళలు ఆగస్టులో రాయ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర గ్రామోద్యోగ్ శాఖ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో వారు సంప్రదాయ కోసా సిల్క్ వస్త్రాలు ధరించి ఎంతో ఆత్మవిశ్వాసంతో ర్యాంప్ వాక్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో 'బెంగాల్ 1947' చిత్ర దర్శకుడు ఆకాశ్ ఆదిత్య లామా వీరిని గమనించారు. తన తర్వాతి సినిమాలో వీరికి అవకాశం కల్పించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. 1994లో బస్తర్ ప్రాంతంలో జరిగిన ఓ సున్నితమైన వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘకాలం మావోయిజం ప్రభావిత ప్రాంతాల్లో జీవించిన ఈ మహిళల అనుభవాలు చిత్రంలోని పాత్రలకు పూర్తి సహజత్వాన్ని తెస్తాయని చిత్రబృందం భావిస్తోంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో బస్తర్ అడవుల్లోనే ఈ సినిమా షూటింగ్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కాగా, ఎంపికైన వారికి షూటింగ్‌కు ముందు ఆడిషన్లు నిర్వహించి, 10 నుంచి 15 రోజుల పాటు నటనలో ప్రత్యేక వర్క్‌షాప్ కూడా నిర్వహించనున్నారు. ఈ పరిణామంపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. హింసామార్గాన్ని వీడిన వారికి ఇలాంటి అవకాశాలు రావడం వారి పునరావాసానికి, సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు అడవుల్లో తుపాకులు పట్టిన చేతులతో ఇప్పుడు కెమెరా ముందుకు రానుండటం విశేషం.

# రచితా రామ్ బుగ్గలు గిల్లిన అభిమాని..

**బెంగళూరు, అక్టోబర్ 3 (స్పంద న్యూస్):** కన్నడ స్టార్ హీరోయిన్, 'డింపుల్ క్వీన్' రచితా రామ్‌కు తన పుట్టినరోజు వేడుకల్లో ఓ అభిమాని నుంచి ఊహించని అనుభవం ఎదురైంది. సెల్ఫీ తీసుకున్న ఆనందంలో ఒక యువకుడు ఆమె బుగ్గలు గిల్లగా, రచిత ఏమాత్రం ఆగ్రహం వ్యక్తం చేయకుండా చిరునవ్వుతో స్పందించి అభిమానుల మనసు గెలుచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**